క్లుప్తంగా

బియ్యం పట్టివేత

మెట్‌పల్లిరూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మండలంలోని వేంపేట శివారు మీదుగా టాటా ఏస్ వాహనంలో 20 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయని పేర్కొన్నారు. బియ్యం తరలిస్తున్న నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన రంజిత్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేట శివారు నుంచి 10 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామ శివారులో బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారంతో దాడులు నిర్వహించామని, నిల్వ చేసిన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సుర్జాపూర్‌కి చెందిన కడమంచి లచ్చన్నపై కేసు నమోదు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. దాడుల్లో సిబ్బంది కోటేశ్వర్‌రాజు, నర్సింగరావు, కలీం, వెంకటేశ్, రత్నసాగర్, నరేందర్, వేణు ఉన్నారు.

పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో తనిఖీ

కథలాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని అన్ని విభాగాలను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు, చిన్నారులకు వాక్సినేషన్ కార్యక్రమం సకాలంలో నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో డెలివరీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్ శ్రీధర్ ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో



ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈవో మధు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు ఏ విధంగా ఉపాధ్యాయులు బోధిస్తున్నారో విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈవోను ఉపాధ్యాయులు, గ్రామస్తులు ,దొెట్టి జీవన్ సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేశ్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఔదార్యం



టీచర్లు పంపిణీ చేసిన టీషర్ట్స్, ప్యాంట్లు

వెల్గటూర్: ఎండపల్లి మండలం పాతగూడూర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు హెచ్‌ఎం,ఉపాధ్యాయులు కలిసి తమ సొంత ఖర్చులతో 90 మంది విద్యార్థులకు రూ.27 వేల విలువ గల టీషర్ట్స్, టై బెల్ట్‌లు, ఐడీ కార్డులు పంపిణీ చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చింతపండు శేఖర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఆంజనేయులు, చోటేమియా, శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి



అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్టులు

రాయికల్: విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సైకాలజిస్టులు శ్రీహరి, రాజేశ్ అన్నారు. బుధవారం రాయికల్ పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, సైకాలజిస్టులతో కలిసి సమావేశం నిర్వహించారు. 6–10వ తరగతి చదువుతున్న విద్యార్థులు తమ పిల్లలపై దృష్టి సారించి గంజాయి, మత్తు పదార్థాలకు, మొబైల్స్‌కు దూరంగా ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ముత్యపు రాజిరెడ్డి, డైరెక్టర్ నివేదితరెడ్డి పాల్గొన్నారు.

గల్ఫ్ పంపిస్తామని డబ్బులు వసూలు

మల్యాల: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి దుబాయ్ పంపిస్తానంటూ నిజామాబాద్ జిల్లాలోని పరిసర ప్రాంతాలకు చెందిన వారి నుంచి సుమారు రూ.30లక్షలకు పైగా వసూలు చేశాడు. వారిని గల్ఫ్ పంపించకపోవడంతో బాధితులు ఆర్మూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్మూర్ పోలీసులు మల్యాలలోని సదరు ఏజెంట్ ఇంటికి వెళ్లి విచారణ చేపట్టినట్టు తెలిసింది.

జగ్గని ఒర్రెకు మరమ్మతులెప్పుడో?

- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- దుర్గంధభరితంగా జగ్గని ఒర్రె
- ఏడాదిన్నక్రితం రూ.2.46 కోట్ల నిధులు



మల్యాల మండల కేంద్రంలోని జగ్గని ఒర్రె

మల్యాల: మండల కేంద్రంలోని జగ్గని ఒర్రె ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఒర్రె నుంచి వెలువడే దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒర్రె మరమ్మతు పనులకు నిధులు మంజూరై ఏడాదిన్నర గడుస్తున్నా పనులు నేటికీ ప్రారంభం కాలేదు. దీంతో కాలనీవాసులు వ్యాధులతో సావాసం చేయాల్సిన దుస్థితి నెలకొంది.

మల్యాలలోని మత్తడి చెరువు– సూరప్ప చెరువులను అనుబంధానం చేసే జగ్గని వాగు మండల కేంద్రంలోని కొత్తపేట ప్రాంతంలోని ఇళ్లలోని మురికినీరు నేరుగా జగ్గని వాగులోకి వస్తుండడంతో మురికికాలువగా మారి, దుర్వాసన వెదజల్లుతోంది. అందులో పందులు సంచరిస్తుండడంతో దోమలు వృద్ధి చెంది, వ్యాధులు ప్రబలుతున్నాయని, మరమ్మతు పనులు చేపట్టాలని ఏళ్ల తరబడి జగ్గని ఒర్రెకు ఇరువైపులా ఉన్న కాలనీవాసులు అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. జగ్గని ఒర్రె మరమ్మతు ఎన్నికల హామీ అంశమైంది.

ఏడాదిన్నర క్రితం 2.46కోట్ల నిధులు మంజూరు..

ఎట్టకేలకు ఏడాదిన్నర క్రితం జగ్గని ఒర్రెను ప్రక్షాళన చేసి, మురికినీరు ఒకవైపు వెళ్లేవిధంగా మరోవైపు జగ్గని వాగును మరింత అభివృద్ధి చేసేందుకు రూ.2.46కోట్ల నిధులు మంజూరు చేస్తు ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిధులు మంజూరై ఏడాదిన్నర గడుస్తున్న నీటి పారుదల శాఖ అధికారులు మరమ్మతు పనులకు సంబంధించిన అనుమతులు పొందడంలో నిర్లక్ష్యం వహించడంతో నేటికి పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

పైపులు వేసి, జగ్గని ఒర్రెపై రోడ్డు వేయాలి..

జగ్గని ఒర్రెను మరమ్మతు చేపట్టిన మురికికాలువల ద్వారా వచ్చే మురికినీరు నిలిచి, దుర్గంధం వెదజల్లుతోంది. దోమలతో పరిసర కాలనీలోని ప్రజలు వ్యాధులు ప్రబలి ఇబ్బందులు పడుతున్నారు. మురికినీరు, మత్తడి చెరువు నుంచి వచ్చే ప్రవాహం పైపులు వేయడంతోపాటు, జగ్గని ఒర్రెపై రోడ్డు వేయడంతో కొత్తపేట నుండి నేరుగా పోచమ్మవాడకు వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

పరిపాలన అనుమతులు వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా.. పనులు ప్రారంభించకపోవడంపై నీటిపారుదల శాఖ డీఈఈ తిరుపతిని వివరణ కోరగా ఒర్రె మరమ్మతుకు 2.46కోట్లు పరిపాలన అనుమతులు వచ్చిన మాట వాస్తవమే. ఒర్రెకు సంబంధించిన రిమార్కులు రెండు నెలల కిందట ఉన్నతాధికారులకు పంపించాం. ఇప్పటికీ అనుమతులు మంజూరు కాలేదని తెలిపారు.

త్వరగా పనులు ప్రారంభించాలి



జగ్గని ఒర్రెలో మురికినీరు నిలుస్తుండడంతో పందులకు నిలయమైంది. ఏటా దోమలతో ఇంటింటా వ్యాధుల బారిన పడుతున్నాం. ఒర్రె నుండి దుర్గంధం వెదజల్లుతుండడంతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. త్వరగా జగ్గని ఒర్రె మరమ్మతు పనులు ప్రారంభించాలి.

– బండారి అశోక్, ఒర్రెగడ్డ కాలనీవాసి, మల్యాల

ఒర్రెను అభివృద్ధి చేయాలి



జగ్గని ఒర్రెను పైపులతో మూసివేసి, రోడ్డు వేయడంతో స్థానికులకు రవాణా సౌకర్యం మెరుగుపడడంతోపాటు స్థలం అందుబాటులోకి వస్తుంది. మురికికాలువ దుర్గంధం నుండి విముక్తి లభిస్తుంది. జగ్గని ఒర్రెపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. అవసరమైతే మరిన్ని నిధులు విడుదల చేసి, మల్యాల అభివృద్ధికి కృషి చేయాలి.

– కొక్కుల శ్రీనివాస్, మల్యాల

సీఎం సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: సీఎం సహకారంతో పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. జగిత్యాలలో పార్కులు, మార్కెట్లు, శ్మశానవాటికలు, డివైడర్లు, ఓపెన్ జిమ్‌లతో పాటు, నర్సరీలు, మినీ ట్యాంక్‌బండ్, యావర్‌రోడ్ 1000 మీటర్ల విస్తరణ, 14 జోన్ల మార్పు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సీఎం ఎంతో సహకారిస్తూ నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. పట్టణ పారిశుద్ధ్యం కోసం 16 నూతన ఆటోలను కొనుగోలు చేయడం జరిగిందని, గెలిపించిన ప్రజలకు పట్టణాభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని చెప్పారు. కుటుంబ సర్వేకు నియోజకవర్గ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ చిరంజీవి పాల్గొన్నారు.

దేశభక్తి చాటుకున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ సమయంలో నిత్య జనగణమనకు సమయం కావడంతో అందరు దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో పాటు, చైర్‌పర్సన్ జ్యోతి జాతీయ గీతాన్ని ఆలపించిన తర్వాత అభివృద్ధి పనులు ప్రారంభించారు.

ఎమ్మెల్యేను కలిసిన ట్రాఫిక్ ఎస్సై

జగిత్యాలక్రైం: జగిత్యాల ట్రాఫిక్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మల్లేశం బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రోడ్లు భవనాల శాఖ ఏఈఈగా లక్ష్మీకాంత్

కథలాపూర్: రోడ్ల భవనాల శాఖ కథలాపూర్ సెక్షన్ ఏఈఈగా లక్ష్మీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు మెట్‌పల్లి డివిజన్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇన్నాళ్లు కథలాపూర్ సెక్షన్ ఏఈఈగా జగిత్యాల ఏఈఈ శ్రీకాంత్‌కు అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం సెక్షన్‌కు పూర్తిస్థాయి ఏఈఈగా లక్ష్మీకాంత్‌ను నియమించారు.

బీసీ డెడికేషన్ కమిషన్‌పై హర్షం

మేడిపల్లి: బీసీ కులగణనలో భాగంగా బీసీ డెడికేషన్ కమిషన్ ఏర్పాటుపై మేడిపల్లి మాజీ సర్పంచ్ బొంగోని రాజా గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. మేడిపల్లిలో బుధవారం మాట్లాడారు. ఏళ్లుగా బీసీలు ఎన్నోరకాలుగా అణిచివేయబడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో బీసీలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలోగోపు రాజేశ్వర్‌రెడ్డి, వీరవత్తిని శేఖర్, పోతు గణేశ్ పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



కొండగట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల,జూనియర్ కళాశాలలో బుధవారం 68వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 14 బాలికలు,బాలుర వాలీబాల్ పోటీలు ఘనంగా ప్రారంభమయినాయి.కొడిమ్యాల ఎస్సై సందీప్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.లావణ్య క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు లోను కాకుండా క్రీడల పట్ల అభిమానాన్ని పెంచుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. విజేతలకు శ్రీ రాఘవేంద్ర హాస్పిటల్ కరీంనగర్ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. మండల విద్యాధికారి ఐత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు గడ్డం జీవన్ రెడ్డి,ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ లక్ష్మీ నాయక్, పేట ప్రెసిడెంట్ విశ్వప్రసాద్ ,సెక్రెటరీ అశోక్, శ్రీనివాస్ రెడ్డి ,జి లక్ష్మణ్,సంపత్ రావు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బుధవారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పేదింటి ఆడ బిడ్డలకు వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, కౌన్సిలర్లు బట్టు సునీల్, సజ్జు, నాయకులు ఫయీం, సింగిరెడ్డి నారాయణ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

మల్లాపూర్: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని నడికుడ, సిరిపూర్, రాఘవపేట్, సాతారం గ్రామాల్లో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ నందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాటిపెల్లి సరోజన ఆదిరెడ్డి, గౌరు నాగేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సారంగాపూర్: మండలంలోని కొల్వాయి, నర్సింహులపల్లె గ్రామాల్లోధాన్యం కొనుగోలు కేంద్రాలను బీర్‌పూర్ ఎంపీడీవో లచ్చాలు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమలో విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, సీసీ రమేష్‌నాయక్, పుష్పలత, వీవోఏలు ఉదయ, నీరజ, రైతులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ ప్రసాద్ సిబ్బందిని కోరారు. మండలంలోని ఎర్దండిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించి మాట్లాడారు. తూకం వేసిన ధాన్యం వెంటనే తరలించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి మనోజ్, కారోబార్ రత్నం పాల్గొన్నారు.

మల్లాపూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడపుల పుష్పలత నర్సయ్య అన్నారు. మండలంలోని గొర్రెపల్లి, కుస్తాపూర్, గుండంపల్లి, రత్నాపూర్, సిరిపూర్, ఒబులాపూర్, మొగిలిపేట్ గ్రామాల్లో బుధవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో జగదీశ్, ఏపీఎం దేవరాజ్, సీసీలు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల: కరీంనగర్‌లోని శాతావాహన విశ్వవిద్యాలయం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో స్థానిక తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యార్థి మౌనిక ఎంపికైంది. అంతర్ విశ్వవిద్యాలయ సౌత్ జోన్‌స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గునక శ్రీలత, ఉపాధ్యాయులు అభినందించారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల–కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు పెంబట్లలో బుధవారం ఒక చోట చేరి, తమ గురువులను సన్మానించుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయ పలకరింపులు జరుపుకున్నారు. అనంతరం తమ క్లాస్‌మేట్ ఇటిక్యాల సుమలత భర్త నారాయణ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా, ఆయన చికిత్స కోసం రూ.50 వేల నగదు, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో తేలు రాజు, గోపి మహేశ్, రాజేశ్, నాగరాజు, స్నేహ, జమున, వరలక్ష్మి, వసంత పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బంది రానీయం



విద్యార్థులతో కలిసి కూర్చుని ముచ్చటిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్ : గురుకులం విద్యార్థులకు ఇబ్బంది కలగనీయబోమని విప్ లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురుకులాలకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు మండలంలోని స్తంభంపల్లి పాఠశాలలో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో పాల్గొన్నారు. గురుకులం సమస్యలు తన దృష్టికి వచ్చాయని, పరిష్కరిస్తానని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోపిక, వైస్ చైర్మన్ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.



కనుల పండువగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

రాయికల్: మండలంలోని కుర్మపల్లిలో ఆంజనేయ శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో యంత్ర విగ్రహ స్థాపన, పూర్ణాహుతి, హారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



బుగ్గారంలో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

బుగ్గారం: రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యం విక్రయించి మద్దతు పొందాలని మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 25 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి,ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య,తహశీల్దార్ మాజిద్,ఎంపీడీవో శ్రీనివాస్,నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం



పొరండ్లలో సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో రమాదేవి



మోహన్‌రావుపేటలో సర్వే పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్/కోరుట్ల/కోరుట్ల రూరల్/కథలాపూర్/ఇబ్రహీంపట్నం/సారంగాపూర్/రాయికల్/వెల్గటూర్/పెగడపల్లి: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం జిల్లావ్యాప్తంగా ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహించి ఇళ్లకు స్టికర్లు వేశారు. పలుచోట్ల అధికారులు సర్వే తీరును పరిశీలించి ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వేలో ఇచ్చిన అంశాలన్నింటిని పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

• వృద్ధుల ఆత్మహత్యపై విచారణ జరపాలి

జగిత్యాల: రాష్ట్రంలో వృద్ధులు ఎక్కడ ఆత్మహత్యలకు పాల్పడ్డ వారి మృతి పట్ల విచారణ జరిపించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో వృద్ధుల ఆత్మహత్యలపై జిల్లా స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్‌లో గంగారాం అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై విచారణ జరపాలని పోలీసులను కోరుతూ అసోసియేషన్ ప్రతినిధులు ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు గౌరిశెట్టి విశ్వనాథం, హన్మంతరెడ్డి, విజయ్, పాల్గొన్నారు.

• చెక్కులు పంపిణీ

ధర్మపురి: మండలంలోని రాజారం గ్రామానికి చెందిన 10 మందికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. లబ్ధిదారులు విప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రంగు అశోక్, మహేందర్, బాపు, రమేశ్ పాల్గొన్నారు.

• వేంపేటలో ఉచిత పశువైద్య శిబిరం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేటలో పశువైద్య,సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి పాడిరైతులు పశువులను పెద్ద సంఖ్యలో తీసుకువచ్చారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం పశుపోషణలో తీసుకోవాల్సి జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి మనీషా, పశువైద్యులు అశోక్, సురేశ్, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ట్రాక్టర్లకు జియో ట్యాగింగ్

మల్యాల:మండలంలోని గ్రామ పంచాయతీల ట్రాక్టర్లకు జియో ట్యాగింగ్ ఏర్పాటు చేశారు. చెత్త సేకరణ కోసం పంచాయతీలకు గత ప్రభుత్వం ట్రాక్టర్లు కేటాయించింది. బుధవారం ఎంపీడీవో వద్ద మండలంలోని అన్ని జీపీల ట్రాక్టర్లను ట్రాక్ చేసేందుకు జియో ట్యాగింగ్ ఏర్పాటు చేశారు. జియో ట్యాగింగ్‌తో ఇకపై ట్రాక్టర్ ఎక్కడ నిలిచిపోయింది.. ఎక్కడి నుంచి చెత్త సేకరిస్తున్నారు.. ఎక్కడ డంపింగ్ చేశారు వంటి అన్ని అంశాలను పరిశీలించే అవకాశం ఉంది.

• రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం

ధర్మపురి: పట్టణానికి చెందిన ముప్పట్ల నిరంజన్ వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రోడ్డు ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంచి వైద్యం అందించాలని వైద్యులకు ఫోన్ ద్వారా తెలిపి, వైద్య ఖర్చుల కోసం ఆయన తరపున రూ. 50 వేలను పంపించగా, కాంగ్రెస్ నాయకుడు వేముల రాజేశ్ బాధితుడికి అందజేశారు.

• విద్యార్థులకు అల్పాహారం ప్రారంభం

సారంగాపూర్: బీర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు అదనపు తరగతులను ప్రారంభించి, వారికి స్నాక్స్ అందించే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. పాఠశాలలో పదో తరగతిలో 72 మంది విద్యార్థులు ఉండగా, వారికి సాయంత్రం 4.15 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు గంట పాటు అదనపు తరగతులను ప్రారంభించారు. ఆ సమయంలో విద్యార్థులు ఆకలితో బాధపడకూడదని, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సొంతంగా స్నాక్స్‌కు డబ్బులు సమకూర్చి స్నాక్స్ అందిస్తున్నారు. అదనపు తరగతులు ఫిబ్రవరి వరకు జరుగుతాయని హెచ్‌ఎం నర్సింహ్మామూర్తి తెలిపారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన ఓగుల అజయ్ రేకులపల్లి ప్రాథమిక పాఠశాలకు వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా అజయ్‌ను ఎంఈవో సిరుప నాగభూషణం, కాంప్లెక్స్ హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం సమీర్ సన్మానించారు.

• కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన బ్లాక్ బెల్ట్ పరీక్షలో ఇబ్రహీంపట్నంకు చెందిన కరాటే విద్యార్థి ఎ.విశ్వంత్ జాతీయ స్థాయి బ్లాక్‌బెల్ట్ సాధించినట్లు కరాటే జిల్లా ప్రధాన శిక్షకుడు ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. జపాన్ బ్రౌన్ బెల్ట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వి. అర్వింత్, ఎ. రుషికేశ్‌కు రాష్ట్ర ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్ మాస్టర్ బ్లాక్ బెల్ట్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు.

• ఎంబీబీఎస్ సీటు సాధించిన అర్చన

రాయికల్: పట్టణానికి చెందిన చిట్యాల రాజేశం –లావణ్య దంపతుల కూతురు అర్చన ఎంబీబీఎస్‌లో సిద్దిపేటలోని సురభి మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. అర్చన 1–5వ తరగతి వరకు రాయికల్ వివేకవర్ధినిలో, 6–10వ తరగతి విశ్వశాంతి ఉన్నత పాఠశాల, ఇంటర్‌లో అల్ఫోర్స్ కళాశాలలో చదివింది. అర్చన సీటు సాధించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.